

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65


జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.136	197	224
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.136	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.5 | కనిష్ఠం 24.2

వటపత్రశాయికి వరహాల లాలీ

- రాత్రివేళ బాలకృష్ణుడిగా యాదాచల నృసింహుడు
- యాదగిరిక్షేత్రంలో నేత్రపర్వంగా అలంకార సేవలు
- దేదీప్యమానంగా వెలుగులీనుతున్న నృసింహ కొండ

యాదగిరిగుట్ట, మార్చి14: వటపత్రశాయికి వరహాల లాలీ.. రాజీవనేత్రునికి రతనాల లాలీ.. అంటూ భక్తులు ఏకశిఖరవాసుడు లక్ష్మీనారసింహుడిని సేవించి తరించారు. అవతార పురుషుడైన శ్రీమహావిష్ణువు శ్రీకృష్ణుడి అవతారంలో వటపత్రశాయిగా భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు స్వామివారిని వటపత్రశాయిగా చిన్నికృష్ణుడి విశేష అలంకరణలో పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాల ఆభరణాలతో దివ్యమనోహరంగా తీర్చిదిద్దారు. వటపత్రంపై శయనించిన చిన్నికృష్ణుడిని ప్రధానాలయ తిరువీధుల్లో ఊరేగించారు. భక్తజనబాంధవుడు యాదాచల నృసింహుడే చిన్నికృష్ణుడిగా తలపించే సన్నివేశాన్ని దర్శించుకొని భక్తులు ఆనందపరవశం చెందారు. రుత్వికులు, అర్చకులు, వేదపండితుల పారాయణాలు, వేద పఠనాలతో మంగళవాయిద్యాల నడుమ స్వామివారి అలంకార సేవను ప్రధానాలయ తూర్పు రాజగోపురం ఎదుటగల వేదికపై అధిష్ఠింపజేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక పర్వాలను ప్రధానార్చకులు నల్లం థిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, మరింగంటి మోహనాచార్యులు, అర్చక బృందం, వేదపండితులు, రుత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈవో రామకృష్ణారావు, భక్తులు అలంకారమూర్తిని దర్శించుకున్నారు.



వటపత్రశాయిగా స్వామివారు

నిత్య హోమం.. వేదపారాయణాలు

స్వామివారి బ్రహ్మోత్సవ కైంకర్యాల్లో భాగంగా గురువారం ఉత్తర ప్రాకార మండపంలోని యాగశాలలో ఉదయం, సాయంత్రం రుత్వికులు మూలమంత్ర, మూర్తిమంత్ర పఠనాలతో హోమ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి అలంకారసేవ ముందు ప్రబంధ పారాయణ పఠనం కొనసాగింది. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు, రుత్వికులు పాల్గొన్నారు.



వటపత్రశాయి అలంకార సేవను ఊరేగిస్తున్న అర్చకులు






హంసవాహనంపై స్వామివారు..

యాదగిరీశుడికి వైభవంగా నిజాభిషేకం

యాదగిరీశుడికి గురువారం నిజాభిషేకం, నిత్యార్చనలు ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. ప్రభాతవేళ సుప్రభాతంతో నిత్యవిధి కైంకర్యాలు ఆరంభించారు. గర్భాలయంలోని స్వయంభువులను పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చనలు నిర్వహించారు.

నేటి పర్వాలు

ఉదయం 9గంటలకు మురళీకృష్ణాలంకారసేవ అలంకారసేవ.. రాత్రి 7గంటలకు పొన్నవాహనంపై తిరువీధుల్లో విహరిస్తారు.




విద్యుద్దీపాల వెలుగులో యాదగిరిక్షేత్రం

హంసవాహన సేవలో

భగవంతుడు తన మనోనేత్రంతో లోకంలోని మంచి.. చెడులను వేరుచేసే విధానానికి ప్రతీకగా హంసను వేదశాస్త్రాల్లో పేర్కొంటారు. పాలను, నీటిని వేరు చేయగల హంసను దివ్య వాహనంగా అధిరోహించిన లక్ష్మీనృసింహుడు గురువారం రాత్రి భక్తజనులకు దర్శనమిచ్చి పండిత, పామర, జనులను తరింపజేశాడు.

ఓపీఎస్‌లకు..
సర్వీస్ గండం!

- తాజా బదిలీల సందర్భంగా ఏజెన్సీ ద్వారా నియామక ఉత్తర్వులు
- మూడేళ్ల సర్వీసు మాయం
- జేపీఎస్‌లుగా క్రమబద్ధీకరించినప్పుడూ పక్షపాతమే



నల్లగొండ, మార్చి 14 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఔట్‌సోర్స్ పంచాయతీ కార్యదర్శుల(ఓపీఎస్) కొనసాగింపుపై రోజుకో నిర్ణయం అమలు చేస్తుండడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటివరకు వేతనాలు ఔట్‌సోర్స్ ఏజెన్సీ ద్వారా ఇస్తున్నా, బదిలీ ఉత్తర్వులు, ఇతర అధికారిక ఆర్డర్లన్నీ కలెక్టర్, జిల్లాపంచాయతీ అధికారి కార్యాలయం ద్వారా అం దేవి. తాజాగా, జిల్లాలో కొందరు ఔట్‌సోర్స్ పంచాయతీ కార్యదర్శుల బదిలీ సందర్భంగా ఆ ఉత్తర్వులు ఔట్‌సోర్స్ ఏజెన్సీ ద్వారా ఇవ్వడంతో పాటు, అదే రోజు సంబంధిత పంచాయతీ ఔట్‌సోర్స్ కార్యదర్శిగా నియమించినట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు. దీంతో తమ సీనియారిటీని కోల్పోయినట్లేనని, ఉద్యోగ భద్రత ప్రమాదంలో పడిందని ఓపీఎస్‌లు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా మార్చిన సందర్భంలో ఇష్టారీతిన వ్యవహరించిందని, రాజకీయ జోక్యంతో కొందరికి మాత్రమే జేపీఎస్‌లుగా అవకాశం కల్పిస్తే, మరికొందరిని ఓపీఎస్‌లుగానే వదిలేసిందని ఆరోపిస్తున్నారు. దీనికి తోడు, తాజాగా పూర్తిగా ఓపీఎస్‌లను పూర్తిగా అవుట్‌సోర్స్ ఏజెన్సీ పరిధిలోకి నెట్టేస్తూ అధికారులు నిర్ణయం తీసుకోవడంపై తమకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని ఆందోళన చెందుతున్నారు.

ఏజెన్సీ ద్వారా ఉత్తర్వుల వెనక మతలబేంటో?

రాష్ట్రంలో 2018లో టీఎస్‌పీఎస్సీ ద్వారా 2వేలమంది వరకు జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నియామకం జరిగింది. ఆ తరువాత వేర్వేరు కారణాలతో పంచాయతీ కార్యదర్శుల ఖాళీలు ఏర్పడంతో 2018 జాబితా ప్రకారమే ఆర్డర్ ఆఫ్ మెరిట్, రోస్టర్ విధానం ద్వారా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కార్యదర్శుల ఖాళీలు భర్తీ చేస్తూ వచ్చారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1,094 మంది ఓపీఎస్‌లుగా నియమితులవ్వగా, అందులో నల్లగొండ జిల్లాలో 178 మంది నియామకమయ్యారు. వారిలో 100మంది వరకు 2020-2023 మధ్య కాలంలో జేపీఎస్‌లుగా క్రమబద్ధీకరణ పొందారు. రాజకీయ పలుకుబడి, అధికారుల ప్రాపకం ఉన్న వారినే జేపీఎస్‌లుగా క్రమబద్ధీకరించారని మిగతా ఓపీఎస్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. తమను మాత్రం ఏజెన్సీల కిందకు నెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 700 మందివరకు ఓపీఎస్‌లుంటే, అందులో నల్లగొండ జిల్లాలో 78 మంది ఉన్నారు. వీరికి ఇప్పటివరకు బదిలీలు, ఇతర ఆదేశాలు ఏవైనా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి ద్వారానే వచ్చేవి. దీంతో ఉద్యోగం ఎప్పటికైనా క్రమబద్ధీకరిస్తారని, చేసిన పనికి సర్వీసు నమోదవుతుందని భావిస్తున్న సందర్భంలో తాజాగా, బదిలీల నేపథ్యంలో ఏజెన్సీ ద్వారా ఉత్తర్వులు ఇవ్వడంతో వారు ఖంగుతిన్నారు. ఉత్తర్వుల్లో కొత్తగా ఉద్యోగ నియామకం జరిగినట్లు పేర్కొన్నారని, ఆరునెలల ప్రాతిపదికనే ఈ ఉద్యోగమని పేర్కొనడంపై ఆవేదన చెందుతున్నారు. తాజా ఉత్తర్వులతో మూడేళ్ల సీనియారిటీని కోల్పోవాల్సి వస్తుందని, ప్రభుత్వం మారిన తర్వాత తమను క్రమబద్ధీకరిస్తుందనే విశ్వాసంలో ఉన్న సమయంలో అధికారులు తీసుకున్న నిర్ణయం తమను ఇబ్బందుల్లోకి నెట్టివేస్తోందని ఆందోళన చెందుతున్నారు. కనీసం గతంలో పాటించిన రీతిలోనైనా బదిలీలు, ఇతర ఉత్తర్వులు ఇస్తే బాగుండేదని, కానీ తమకు ఉద్యోగాలపై హక్కుల్లేకుండా చేసేలా ఏజెన్సీ ద్వారా కొత్త నియామకాల మాదిరిగా ఉత్తర్వులివ్వడం తమ ఉద్యోగాలకు ఎసరుపెడుతున్నట్టుగానే ఓపీఎస్‌లు పలువురు 'ఆంధ్రజ్యోతి'తో వాపోయారు. దీనిపై ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు.

టీఎస్ స్థానంలో టీజీ

- కొత్త వాహనాల రిజిస్ట్రేషన్‌లో మారనున్న కోడ్
- నేటి నుంచి నెంబర్ ప్లేట్లపై టీజీగా అమలు
- సాంకేతికంగా మార్పులు చేర్పులు పూర్తి
- పాత వాహనాల కోడ్‌లు యథాతథం



నల్లగొండ, మార్చి 14: రాష్ట్రంలో వాహనాల రిజిస్ట్రేషన్‌ల కోడ్ టీఎస్ నుంచి టీజీగా మారనుంది. ఇప్పటికే కేంద్ర రవాణాశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటి వరకు టీఎస్ కోడ్ ద్వారా జరిగిన రిజిస్ట్రేషన్లలో ఎలాంటి మార్పు ఉండదు. ఈనెల 15వ తేదీన అంటే శుక్రవారం నుంచి కొత్త వాహనాలకు టీజీ ద్వారా రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక టీఎస్ పేరును టీజీగా మార్చాలని నిర్ణయించడంతో పాటు కేబినేట్‌లో చర్చించి కేంద్రానికి కూడా నివేదిక అందజేసింది. దీనికి కేంద్ర ఉపరితల రవాణాశాఖ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఉన్న టీఎస్ నెంబర్ ప్లేట్లను మార్పులు, చేర్పులు చేయాల్సిన అవసరం లేదు. కొత్తగా కొనుగోలు చేసిన వాహనాలకే నెంబర్ ప్లేట్లు టీజీతో వస్తాయి. రాష్ట్రం ఏర్పడినప్పుడు సైతం ఇదే విధంగా మార్పులు చేశారు. అప్పటి వరకు ఏపీ రిజిస్ట్రేషన్‌లను యథావిధిగా కొనసాగించారు. విభజన అనంతరం వాహనదారులపై భారం పడకుండా ఏపీ నెంబర్ పేట్లనే కొనసాగించారు. తాజాగా, టీఎస్ కోడ్‌ను సైతం యథావిధిగా ఉంచడంతో ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేయించుకున్న వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది లేదు.

సాంకేతిక మార్పులు పూర్తి

టీఎస్ నుంచి టీజీగా కోడ్ మారడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా రవాణాశాఖ కార్యాలయాల్లో సాంకేతిక మార్పులు పూర్తి చేశారు. గురువారం రాత్రి వరకు సర్వర్లను డౌన్ చేసి టీఎస్ స్థానంలో టీజీ కోడ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చే ప్రక్రియను చేపట్టారు. రాష్ట్ర రవాణాశాఖ కార్యాలయాన్ని అనుసంధానం చేసుకుని ఈ మార్పులను చేశారు. ఇప్పటికే స్లాట్ బుక్ చేసుకున్న వారికి శుక్రవారం నుంచి టీజీ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేస్తారు. ఉమ్మడి జిల్లాలో సుమారు మూడున్నర లక్షలకు పైగా వాహనాలు టీఎస్ కోడ్‌తో రిజిస్ట్రేషన్ అయినట్లు సమాచారం. ఇక నుంచి అన్ని వాహనాలకు టీజీ కోడ్‌తో రిజిస్ట్రేషన్ చేయనున్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం 2014 జూన్ 2 నుంచి టీజీ కోడ్ అమలులోకి వచ్చింది. అయితే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దీనిపై అభ్యంతర వ్యక్తం చేస్తూ తెలంగాణ స్టేట్(టీఎస్)కు ఆమోదం తెలపాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఆ కోడ్ వచ్చే వరకు రాష్ట్రంలో కొత్త వాహనాల రిజిస్ట్రేషన్లు కూడా నిలిపివేశారు. కేంద్రం అనుమతి కోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 10రోజుల పాటు రిజిస్ట్రేషన్లను నిలిపింది. ఆ తరువాత కేంద్రం నుంచి అనుమతి వచ్చాక టీఎస్ కోడ్‌తో రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో టీఎస్ స్థానంలో టీజీ కోడ్ వచ్చింది. ఇక కొత్త వాహనాల నెంబర్ ప్లేట్లపై నెంబర్‌కు ముందు టీజీ కనిపించనుంది.

టీజీ కోడ్‌తో రిజిస్ట్రేషన్లకు ఏర్పాట్లు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా టీజీ కోడ్‌తో కొత్త రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. శుక్రవారం నుంచి ఈ నూతన విధానం అమలులోకి వస్తుంది. సాంకేతికంగా మార్పులు చేయడంతో పాటు రిజిస్ట్రేషన్‌లకు అనుగుణంగా ఏర్పాట్లు చేశాం. కొత్త వాహనదారులందరికీ ఇక నుంచి వాహనాల నెంబర్ ప్లేట్లపై టీఎస్ స్థానంలో టీజీ కోడ్ రానుంది.

● ఐ.లావణ్య, నల్లగొండ ఆర్టీవో

గడీల పాలనను బద్ధలు కొట్టిన ప్రజలు

- సామాన్యుల కోసం సచివాలయం గేట్లు తెరిచే ఉంటాయి
- ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన కేసీఆర్
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



మోడల్ కాలనీ పునరుద్ధరణ పనుల శంకుస్థాపన అనంతరం మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హుజూర్‌నగర్, పాలకవీడు, మార్చి 14: రాష్ట్రంలో గడీల పాలనను బద్ధలు కొట్టి పారదోలామని, ఇందిరమ్మ పాలన తెచ్చుకున్నామని గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఫణిగిరిగట్టు వద్ద రూ.70.84 కోట్లతో నిర్మిస్తున్న మోడల్ కాలనీ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన, పాలకవీడు మండలంలోని బెట్టెతండాలో రూ.33.80కోట్లతో నిర్మించనున్న ఎత్తిపోతల పథకం పనులను శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఆయా చోట్ల జరిగిన సభల్లో మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. హక్కుల కోసం సాధించుకున్న తెలంగాణను పదేళ్ల పాటు కేసీఆర్ ఎలా దోచుకున్నారో ప్రజలు గమనించారన్నారు. నేడు సచివాలయంలో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలను సామన్యులు సైతం వచ్చి కలుస్తున్నారన్నారు. కేసీఆర్ ప్రగతి భవన్, సచివాలయంలోకి ఎవ్వరినీ రానివ్వకుండా గడీలు వేసుకున్నారన్నారు. నేడు సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల వద్దకు వస్తున్నారన్నారు. ప్రజల కష్టంతోనే తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిందన్నారు. ప్రజల ముందుకు ప్రతీ ఇంటికి ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిందన్నారు. తాము పాలకులం కాదు సేవకులమని అన్నారు. ధరణి పేరుతో కేసీఆర్ కుటుంబం, ఆయన తొత్తులు వేల కోట్ల రూపాయల విలువైన భూములు దోచుకుని ధరణి రికార్డుల్లోకి ఎక్కించుకున్నారని ఆరోపించారు. ధనిక రాష్ట్రాన్ని కేసీఆర్ రూ.7లక్షల కోట్ల అప్పులపాల్జేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 33వేల ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. 70 రోజుల్లో నాలుగు గ్యారంటీలను అమలు చేశామన్నారు. వైఎస్ హయాంలో 17 లక్షల ఇళ్లు నిర్మించగా, తాము ఏటా 4.50లక్షల ఇళ్లు నిర్మిస్తామన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు ఇస్తామన్నారు. రూ.5లక్షల చొప్పున ఇంటి నిర్మాణానికి నిధులు ఇస్తామన్నారు. మంత్రి ఉత్తమ్ మాత్రం హుజూర్‌నగర్‌కు అంతకంటే ఎక్కువ ఇళ్ల మంజూరు చేయించుకుంటారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నీతి, నిజాయితీగా పనిచేస్తుంటే కేసీఆర్ కుటుంబం సొల్లు మాటలు, కల్లబొల్లి మాటలు మాట్లాడుతోందని విమర్శించారు. తెలంగాణలో కరువుకు బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమన్నారు. వారు చేసిన పాపాలు, శాపాల ఫలితమే కరువు ఏర్పడిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో లక్ష కోట్ల రూపాయలు దోచుకున్నారని, పవర్ ప్లాంట్ల పేరుతో లక్షల కోట్లు స్వాహా చేశారని విమర్శించారు. నిరుద్యోగుల జీవితాలతో కేసీఆర్ కుటుంబం ఆడుకుందన్నారు. నోటిఫికేషన్లు వేసి పరీక్షా పత్రాలను జిరాక్స్ సెంటర్లలో విక్రయించుకున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి, నోటిఫికేషన్లు వేశామని, 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. టీచర్ పోస్టులు కూడా భర్తీ చేస్తామన్నారు. ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డు ఇస్తామన్నారు. సాగర్‌ను ఎడారిగా మార్చి కృష్ణా నదిలో నీళ్లు లేకుండా చేసింది బీఆర్ఎస్ నాయకులేనన్నారు. సాగర్‌లో నీళ్లు లేకపోవడానికి కేసీఆర్ విధానాలే కారణమన్నారు. గతంలో నదుల్లో నీరు ఉన్నా, ప్రాజెక్టులు పొంగి పొర్లుతున్నా రైతులకు నీరు ఇవ్వకుండా మోసగించింది కేసీఆర్ అని అన్నారు. కరువు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు వేస్తున్న బీఆర్ఎస్ నేతలకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు.

రాష్ట్రాన్ని దివాలా తీయించిన కేసీఆర్ : స్పీకర్

రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ అప్పులపాలు చేసి దివాలా తీయించారని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సోనియాగాంధీ ఒక దళితుడినైన తనను అసెంబ్లీ స్పీకర్‌గా చేసి గౌరవించారన్నారు. ఆమె సారథ్యంలో ఇచ్చిన హామీలైన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్నారన్నారు. అభివృద్ధి కోసం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిరంతరం పరితపిస్తున్నారన్నారు. ఆయన ఈ ప్రాంతానికి చెందడం హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గ ప్రజలు ఎంతో అదృష్టవంతులన్నారు.

పర్యటన విజయవంతం

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన విజయవంతమైంది. వారు హెలికాప్టర్‌లో సాయంత్రం 4గంటలకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలంలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి 4.30గంటలకు ఫణిగిరి గట్టు వద్ద ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ప్రారంభించారు. సుమారు 50 నిమిషాల పాటు అక్కడి సభలో ప్రసంగించారు. 5.20గంటలకు హెలీప్యాడ్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి పాలకవీడు మండలం బెట్టెతండాకు చేరుకున్నారు. కార్యక్రమాల్లో కలెక్టర్ వెంకట్రావు, ఎస్పీ రాహుల్‌హెగ్డే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు చావా కిరణ్మయి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, వైస్‌ఛైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, ఎంపీపీ గూడెపు శ్రీనివాసు, చావా సహదేవరావు, యరగాని నాగన్న, దొంగిరి వెంకటేశ్వర్లు, తన్నీరు మల్లికార్జున్‌రావు, చెవిటి వెంకన్న, మంజుల, ఫణికుమారి, సతీష్, భాస్కర్, సుబ్బారావు, ఎంపీపీ గోపాల్, జడ్పీటీసీ బుజ్జీ మోతీలాల్, జితేందర్ రెడ్డి, నాగిరెడ్డి, నీమానాయక్, మధునాయక్, హౌసింగ్ ఎస్ఈ రవీందర్‌రావు, అరుణ్‌కుమార్, వీరారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకన్నయాదవ్, మంజూనాయక్, తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో చేయాలి : మంత్రి ఉత్తమ్



సభలో మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్‌లోని ఫణిగిరి గట్టు వద్ద పునరుద్ధరిస్తున్న 2,160 ప్లాట్ల మోడల్ కాలనీ పనులను నాణ్యతతో చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు ఎవ్వరికీ లంచాలు, కమీషన్లు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. మోడల్ కాలనీ పనులకు సంబంధించి కలెక్టర్ ఇసుక, కంకర, ఇతర సామగ్రి అందిస్తారని తెలిపారు. ఎలాంటి ఇబ్బంది ఉన్నా కలెక్టర్ వెంటనే పరిష్కరించాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కక్షగట్టి పదేళ్లపాటు ఇళ్ల నిర్మాణం చేయలేదన్నారు. తాను చేపట్టిన పనులు మళ్లీ తానే పూర్తి చేయాల్సిన పరిస్థితి కల్పించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో గృహ నిర్మాణ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి తొలిసారిగా రూ.70.84కోట్లు మంజూరు చేశారన్నారు. ఏడెనిమిది నెలల్లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గతంలో పట్టణంలో 100 ఎకరాల స్థలం కొనుగోలుచేసి నాలుగువేల ఇళ్లకు శ్రీకారం చుట్టానన్నారు. వ్యక్తిగత గృహాలు, జీ+1 మోడల్ కాలనీ పూర్తి చేస్తానన్నారు. హుజూర్‌నగర్‌లో రెసిడెన్షియల్ పాఠశాల నిర్మిస్తున్నామన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ఆటో కార్మికులకు దత్తత ఫౌండేషన్ ద్వారా ఇన్సూరెన్స్ కల్పిస్తున్నట్టు తెలిపారు. కొంతమంది డ్రైవర్లకు ఇన్సూరెన్స్ పత్రాలను మంత్రి, స్పీకర్ ఈ సందర్భంగా అందజేశారు. బెట్టెతండా లిఫ్ట్ ద్వారా 2,041 ఎకరాలకు నీరందించి ఇక్కడి గిరిజనులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నానని అన్నారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలతో సమానంగా మిర్యాలగూడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బీఎల్ఆర్‌కు హామీ ఇచ్చారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోటాచలం

సూర్యాపేటటౌన్, మార్చి 14: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతీ ఒక్కరికి సీపీఆర్‌పై అవగాహన ఉండాలని డీఎంహెచ్‌వో కోటాచలం అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బందికి సీపీఆర్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హృదయ సంబంధ సమస్య తలెత్తినప్పుడు 108 వాహనం వచ్చేలోపు సమస్యతో బాధపడుతున్న వ్యక్తి ఛాతిపై నిమిషానికి 100సార్లు నొక్కుతూ సీపీఆర్ చేయాలని సూచించారు. విధి నిర్వహణలో ఎలాంటి ఒత్తిడికి లోనకావద్దని సూచించారు. అంతా పాజిటివ్ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రతీ ఒక్కరు ఉదయం సమయంలో కచ్చితంగా అరగంట వ్యాయామం, వాకింగ్ చేయాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు మామిడి నరేష్, డిపో డీఎం సురేందర్, దయాకర్ పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

సూర్యాపేటఅర్బన్, మార్చి 14: జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 32 పరీక్షా కేంద్రాల్లో జనరల్ విభాగంలో 6,002మంది విద్యార్థులకు 6,790 మంది హాజరు కాగా 212 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,220మంది విద్యార్థులకు 1,123మంది హాజరు కాగా, 97 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో జానపాటి కృష్ణయ్య తెలిపారు.

వీరన్న స్ఫూర్తితో బీసీలు వాటా సాధించాలి



కొత్తగూడేనికి చేరిన బీసీ మహాపాదయాత్ర

వీరన్న స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తుంగతుర్తి, మార్చి 14: కుల, వర్గ నిర్మూలన పోరాట యోధుడు, ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుడు మారోజు వీరన్న స్ఫూర్తితో బీసీలు చట్టసభల్లో వాటా సాధించాలని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ పిలుపునిచ్చారు. చట్ట సభల్లో బీసీల వాటా సాధన కోసం ఈనెల 1న మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రారంభమైన మహాపాదయాత్ర 170కిలోమీటర్లు పూర్తి చేసుకుని గురువారం మండలంలోని వెలుగుపల్లికి చేరుకుంది. అక్కడి నుంచి మారోజు వీరన్న స్వగ్రామం కరివిరాల కొత్తగూడానికి చేరుకుంది. వీరన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో జాక్ వైస్ చైర్మన్లు వెలుగు వనిత, పటేల్ వనజ, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్, హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్లు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి



చింతపల్లి, మార్చి 14: నల్లగొండ జిల్లా చింతపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. ఎస్‌ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని హరిజనపురం గ్రామానికి చెందిన తంగెళ్ల పెద్దలక్ష్మయ్య(65) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బంధువుల శుభకార్యానికి భార్యతో కలిసి టీవీఎస్ వాహనంపై రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం అన్నబోయినపల్లి గ్రామానికి గురువారం వెళ్లాడు. శుభకార్యం అనంతరం స్వగ్రామానికి బయలుదేరారు. చింతపల్లి మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్‌బంక్ సమీపంలోకి రాగానే హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్ వైపు వెళుతున్న హోండాసిటీ కారు టీవీఎస్ వాహనాన్ని వెనుకనుంచి బలంగా ఢీకొట్టి పల్టీ కొట్టింది. టీవీఎస్‌పై ఉన్న పెద్దలక్ష్మయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య జంగమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందిన వెంటనే ఎస్‌ఐ యాదయ్య సంఘటనా స్థలానికి చేరుకొని తీవ్రగాయాలైన జంగమ్మను దేవరకొండలోని ఆస్పత్రికి తరలించారు. లక్ష్మయ్యకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని దేవరకొండ సివిల్ ఆసుపత్రికి తరలించారు. లక్ష్మయ్య సోదరుడు వెంకులు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదయ్య తెలిపారు.

వివాహితపై లైంగిక దాడి.. గొంతు కోసి హత్య

దేవరకొండ, మార్చి 14: నల్లగొండ జిల్లా దేవరకొండలో ఓ వివాహితపై లైంగిక దాడి చేసిన గుర్తుతెలియని వ్యక్తులు గొంతు కోసి హత్యచేశారు. సీఐ నర్సింహులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. డిండి మండలం గోనకోలుకు చెందిన వివాహిత(38) భర్తతో వివాదం నేపథ్యంలో పదేళ్లుగా దేవరకొండలో నివాసం ఉంటోంది. దేవరకొండ, కొండమల్లేపల్లి, పీఏపల్లి ప్రాంతాల్లోని పలు హోటళ్లలో పనిచేస్తూ జీవనం సాగిస్తుంది. ఆమె కుమారుడు గోనకోలులో మేనమామ వద్ద ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. మద్యం తాగే అలవాటు ఉన్న ఆమె దేవరకొండలో బస్టాండ్‌తో పాటు, పాడుపడిన ఇళ్లలో రాత్రివేళలో నిద్రించేది. బుధవారం రాత్రి దేవరకొండ బస్టాండ్ పక్కనే ఉన్న పడావుపడిన భవనంలో నిద్రించింది. గురువారం మధ్యాహ్నం మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దేవరకొండ సీఐ నర్సింహులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అక్కడ మద్యం సీసాలు, పురుషులు ధరించే డ్రాయర్‌ను గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆమెకు మద్యం తాగించి లైంగికదాడి చేసి, గొంతు కోసి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నల్లగొండ నుంచి పోలీస్ జాగిలాలను, క్లూస్ టీంలను రప్పించి విచారణ చేస్తున్నారు. పోలీస్ జాగిలాలు బస్టాండ్ పరిసర ప్రాంతంలోని మద్యం దుకాణాల వద్ద కొద్దిసేపు ఆగి వెనుదిరిగాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు. మృతురాలి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు.. రహస్యమేంటి?

- ఇమడలేకనే బీఆర్ఎస్ వీడుతున్నా: కోనేరు కోనప్ప
- మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కాగజ్‌నగర్, మార్చి 14: బీఆర్ఎస్, బీఎస్పీతో పొత్తుపెట్టుకోవటం వెనుక రహస్య ఒప్పందం ఏంటని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనపై లేనిపోని ఆరోపణలు చేసి ఓడించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో బీఆర్ఎస్ జత కట్టడం ఇమడలేకనే ఆ పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. గురువారం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమక్షంలో కోనప్ప కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు జెడ్పీ ఛైర్మన్ కోనేరు కృష్ణారావు, మునిసిపల్ ఛైర్‌పర్సన్ షహీన్ సుల్తానా, వైస్ ఛైర్మన్ రాజేందర్‌తోపాటు పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీలు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కోనప్ప మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌పై తనకు ఎలాంటి కోపం లేదన్నారు. తనకు ఎలాంటి పదవులు వద్దని, కేవలం సిర్పూరు నియోజకవర్గ అభివృద్ధి చాలని వ్యాఖ్యానించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ.. సిర్పూరు నియోజవర్గ సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

బీఆర్ఎస్‌కు పెద్దిరెడ్డి రాజీనామా

హుజూరాబాద్, హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తరువాత కీలక నేతలు పార్టీని వీడుతున్నారు. తాజాగా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. తన ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా అధిష్ఠానం వ్యవహార శైలి ఉందని, అది నచ్చకనే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం రాజీనామా లేఖను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పంపించారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, రాజకీయాలపై సుదీర్ఘ అనుభవం కలిగిన తనకు పార్టీలో సముచిత గౌరవం లభించలేదని పెద్దిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలు, అభిమానులతో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తానన్నారు. కాగా ఆయన అధికార కాంగ్రెస్‌లో చేరతారని సమాచారం.

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ముగ్గురు

మహబూబ్‌నగర్, మార్చి14: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగిసింది. ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి ముగ్గురు అభ్యర్థులు మాత్రమే పోటీలో నిలిచారు. మొత్తం 16మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలనలో ముగ్గురి దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. 10 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచి నవీన్‌కుమార్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి సుదర్శన్‌గౌడ్ బరిలో నిలిచారు. 28న ఎన్నిక జరగనుంది.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన జానారెడ్డి

- రఘువీర్‌రెడ్డి విజయానికి సహకరించాలని విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న రఘువీర్‌రెడ్డి విజయం కోసం సహకరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మాజీ మంత్రి జానారెడ్డి కోరారు. గురువారం బంజారాహిల్స్‌లోని మంత్రి నివాసానికి వెళ్లిన జానారెడ్డి తన కుమారుడు రఘువీర్‌రెడ్డిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో తమ మధ్య ఉన్న అనుబంధాన్ని ఇరువురు నేతలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రఘువీర్‌కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మంత్రి కోమటిరెడ్డి హామీ ఇచ్చారు.

ఆటోడ్రైవర్ల సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి: హరీశ్

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆటో నడవడం లేదని మనస్తాపంతో నిజామాబాద్‌లో ఓ సోదరుడు తన భార్యతో సహా ప్రాణాలు తీసుకున్న హృదయ విదారక ఘటన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కదిలించకపోవడం బాధాకరమని గురువారం ఎక్స్(ట్విటర్) వేదికగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాధగా మారిన వారి బిడ్డ భవిష్యత్‌కు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఆ కుటుంబానికి వెంటనే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. అలాగే ఆటోడ్రైవర్ల జీవనసమస్యకు పరిష్కారం చూపాలని, వారికి రూ.12వేల భృతి ఇవ్వాలని హరీష్‌రావు కోరారు. కాగా, డీఎస్సీ పరీక్షలకు ముందే టెట్ నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరమని మరో ట్వీట్‌లో హరీశ్ పేర్కొన్నారు.

డీకే శివకుమార్‌ను కలిసిన మల్లారెడ్డి

తనయుడితో కలిసి బెంగళూరుకు.. కర్ణాటక డిప్యూటీ సీఎంతో భేటీ

పార్టీ మారుతున్నారనే ఊహాగానాలు.. వ్యాపార లావాదేవీలేనన్న మల్లారెడ్డి

హైదరాబాద్/మేడ్చల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి గురువారం బెంగళూరులోని ఒక హోటల్లో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిశారు. మల్లారెడ్డి తనయుడు భద్రారెడ్డి కూడా వెంట ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి పలువురు నేతలు కాంగ్రెస్‌లోకి చేరుతున్న నేపథ్యంలో మల్లారెడ్డి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్ ముఖ్యనేత ప్రియాంకగాంధీని కలిసేందుకు అవకాశం ఇప్పించమని మల్లారెడ్డి కుటుంబసభ్యులు డీకేను కోరినట్లు సమాచారం. గత వారమే మల్లారెడ్డి, అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి సీఎం సలహాదారు అయిన వేంనరేందర్‌రెడ్డితో భేటీ అయ్యారు. అప్పుడే ఇద్దరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ప్రచారం జరిగింది. దాంతో కేటీఆర్ మల్లారెడ్డిని తన నివాసానికి పిలిపించుకుని మాట్లాడారు. తనకు కాంగ్రెస్‌లోకి వెళ్లే ఆలోచన లేదని మల్లారెడ్డి కేటీఆర్‌కు చెప్పారు. ఆ మాట చెప్పి వారం గడవక ముందే డీకే శివకుమార్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ మారుతున్నట్లు వచ్చిన ఆరోపణలను మల్లారెడ్డి ఖండించారు. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానన్నారు. బెంగళూరుకు ఒక ఫంక్షన్‌కు వచ్చానని, అక్కడ ఒక ప్రైవేటు వర్సిటీ అమ్మకానికి ఉందని ఫ్రెండ్ చెబితే దాని కొనుగోలు గురించి మాట్లాడటానికి మధ్యవర్తి ద్వారా డీకే శివకుమార్‌ను కలిశానని తెలిపారు. , రాజకీయాలేవీ మాట్లాడలేదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి 75 ఏళ్లు దాటుతాయని, ఆ ఎన్నికల్లో పోటీచేసే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. ఈ ఐదేళ్లు బీఆర్ఎస్‌లోనే ఉంటూ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేస్తానని చెప్పారు. మల్లారెడ్డి డీకే శివకుమార్ దగ్గరే ఆగిపోకుండా ప్రియాంకగాంధీ అపాయింట్‌మెంట్ అడగడం ఊహాగానాలకు తావిస్తోంది. ఆస్తులను కాపాడుకోవడానికి కాంగ్రెస్‌లోకి వెళ్లడమే మార్గమని మల్లారెడ్డి భావిస్తున్నారని కాంగ్రెస్‌లోని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మల్లారెడ్డి రాకను మేడ్చల్ కాంగ్రెస్ నేతలు మైనంపల్లి హన్మంతరావు, సుధీర్ రెడ్డి, వజ్రేష్‌యాదవ్, హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్ వ్యతిరేకిస్తున్నారు. రేవంత్ సన్నిహితుడిని కలిసినా చేరిక పని కాకపోవడంతో మల్లారెడ్డి బెంగళూరు వైపు నుంచి నరుక్కొస్తున్నారని భావిస్తున్నారు.

ఆపరేషన్ రేవంత్!

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది. రేవంత్ ఆయన సహచర బృందం కదలికలను గుర్తించడంతో పాటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డబ్బులు ఎక్కడినుంచి, ఏయే మార్గాల్లో, ఎవరెవరు సర్దుబాటు చేస్తున్నారు..? అనే వివరాలను ప్రణీత్ ట్యాపింగ్ చేశారు. ముఖ్యంగా ఎన్నికలకు కొద్ది నెలల ముందు నుంచి రేవంత్‌తో పాటు ఆయనకు అత్యంత సన్నిహితులు, సహకరించే అందరి ఫోన్‌లపైనా ట్యాపింగ్ కొనసాగినట్లు ఆధారాలు లభించినట్లు తెలిసింది. అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ ఆదేశాల మేరకు నడుచుకున్న ప్రణీత్.. రాజకీయ నాయకులు, పోలీసులతో పాటు ప్రైవేటు వ్యక్తుల సహకారం కూడా తీసుకున్నారు. ఎక్కడికక్కడ తమకు అందుతున్న సమాచారం, ఫోన్ నంబర్ల ఆధారంగా ఎస్ఐబీ ప్రధాన కార్యాలయం, ఇతర వార్ రూంల నుంచి రోజుల వ్యవధిలోనే వందల ఫోన్‌ల ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. హార్డ్ డిస్క్‌ల ధ్వంసం, కీలక పత్రాల దహనం కేసు దర్యాప్తులో భాగంగా ప్రణీత్ ఫోన్‌లోని వాట్సాప్ చాటింగ్‌లను దర్యాప్తు అధికారులు పరిశీలించగా బీఆర్ఎస్ నేతలతో పాటు ప్రైవేటు వ్యక్తుల నుంచి వచ్చిన సందేశాలను పరిశీలించారు. ఎన్నికల్లో డబ్బులు ఎవరెవరి చేతులు మారుతున్నాయన్న సమాచారం గుర్తించి కట్టడి చేశారని స్పష్టమైంది. అరెస్టు సమయంలో ప్రణీత్ రావును ప్రాథమికంగా విచారించగా ఒక ఎస్పీ, ఎస్ఐబీ అప్పటి చీఫ్ ఆదేశాల మేరకే తాను, తన బృందం పనిచేసినట్లు వెల్లడించినట్లు తెలిసింది. ప్రణీత్‌ను కస్టడీకి తీసుకుని విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఏడు రోజుల కస్టడీ కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా, ప్రణీత్‌రావు కేసుకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై సీఎం రేవంత్ పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఆరా తీసినట్లు సమాచారం. దీంతో వారు సమగ్ర నివేదిక అందించారని తెలిసింది. ప్రణీత్ వ్యవహారంలో వెలుగులోకి వచ్చిన వ్యక్తుల పేర్లు.. అనుసరించాల్సిన విధానాలపై సీఎంకు వివరించినట్లు సమాచారం. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది.



ప్రణీత్‌రావు (ఫైల్)

ఉన్నతాధికారుల చుట్టూ ఉచ్చు

ప్రణీత్‌తో అంటకాగి కుట్రలో భాగస్వాములైన ఎస్ఐబీ అప్పటి ఉన్నతాధికారులను నేడో రేపో విచారించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పంజాగుట్ట పోలీసులు వారికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఎన్నికల ముందు పనిచేసినవారిపై దృష్టిపెట్టినట్లు సమాచారం. కొన్ని నియోజకవర్గాల్లో అధికారులు వారి ఇళ్లలోనే ప్రత్యేక గదుల్లో (వార్ రూమ్‌లు) ఏర్పాట్లు చేసి, ట్యాపింగ్‌కు పాల్పడినట్లు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటిని సిద్ధం చేసిన ప్రణీత్‌కు పలువురు సహచరులూ సహకరించినట్లు తెలుస్తోంది. మూడు నియోజకవర్గాల్లో విజిలెన్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు, ఎస్ఐబీ అధికారి ఇళ్లలో వార్ రూమ్‌లను ఏర్పాటు చేసి, ప్రముఖుల ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఎన్నికల సందర్భంగా ఓ పార్టీ నిధుల తరలింపులోనూ ప్రణీత్ కీలక పాత్ర పోషించారని అనుమానిస్తున్నారు. డబ్బు, బంగారం, వస్తువులను చేరవేసేందుకు సొంత, ఎస్ఐబీ, గ్రేహౌండ్స్ వాహనాలను వినియోగించారనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ప్రణీత్ ఫోన్ నుంచి కీలక వివరాలు సేకరించే పనిలో సైబర్ నిపుణులు ఉన్నారు. ఆయన తొలగించిన డేటాను రిట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది బయటకు వస్తే మరింతమంది అరెస్టయ్యే అవకాశముందని చెబుతున్నారు. ఇప్పటికే ఎస్ఐబీ లాగర్ రూమ్‌లో పనిచేసిన ఇన్‌స్పెక్టర్, ఎస్సైలను విచారించారు.

ప్రత్యేక బ్యారెక్.. పకడ్బందీ భద్రత

ప్రణీత్‌ను విచారించి ఆధారాలు, సమాచారం రాబట్టేందుకు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ గురువారం నాంపల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రణీత్ న్యాయవాదులకు జడ్జి సూచించారు. శుక్రవారం వాదనలు జరిగే అవకాశముంది. కాగా, పోలీసుల అదుపులో ఉన్న ఆయనను బుధవారం రాత్రి చంచల్‌గూడ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ప్రణీత్‌ను భద్రతా కారణాల దృష్ట్యా ప్రత్యేక బ్యారెక్‌లో ఉంచారు. సీసీ కెమెరా నిఘాతో పాటు నిరంతరం జైలు సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. అటువైపుగా ఇతర ఖైదీలను అనుమతించడం లేదు. గురువారం ఉదయం ప్రణీత్ తరఫు న్యాయవాది అనుదీప్, సోదరుడు వంశీ ములాఖాత్ అయ్యారు.

ట్యాపింగ్ చేయమన్నది ఎవరు?

ట్యాపింగ్‌కు ఎవరు ప్రోత్సహించారు? ఎలాంటి సమాచారం సేకరించారు? ఎవరి పాత్ర ఎంత? అనే ప్రశ్నలకు ప్రవీణ్ స్పష్టంగా సమాధానం ఇచ్చారని తెలుస్తోంది. ఈ మేరకు పంజాగుట్ట పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేసి, సాంకేతిక ఆధారాలను సేకరించారు. ప్రణీత్ ఫోన్ డేటా విశ్లేషించి, ఏయే నంబర్లతో ఎంత మందితో టచ్‌లో ఉన్నారో తెలుసుకున్నారు. ఎవరెవరి ఫోన్‌లు ఎంత కాలం ట్యాప్ చేశారు? తదితర అంశాలను దర్యాప్తు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వార్ రూమ్‌లకు ఈ డేటాను అందించినట్లు అంచనాకు వచ్చారు. డేటాను కాపీ చేసిన హార్డ్ డిస్క్‌లు ఎక్కడున్నాయో దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లోకి జితేందర్‌రెడ్డి!

(మొదటిపేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి జితేందర్ నివాసానికి వెళ్లి అరగంట పాటు సమావేశమయ్యారు. ఇది జితేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరబోతున్నారన్న ప్రచారానికి మరింత ఊతమిచ్చినట్లైంది. మరోవైపు ఈ పరిణామం మహబూబ్‌నగర్ జిల్లాలోనూ కలకలం రేపింది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలి వరకు ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరిలో కాంగ్రెస్ నుంచి జితేందర్‌రెడ్డి పోటీ చేస్తారని పెద్దఎత్తున చర్చ జరిగింది. ఇక గురువారం సాయంత్రం మహబూబ్‌నగర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం వెళ్లి కలిశారంటేనే పార్టీలోకి ఆహ్వానించడానికి కాదా? అని వ్యాఖ్యానించారు. జితేందర్‌రెడ్డి మనస్తత్వం తనకు తెలుసని, ఎంపీగా రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి పనిచేస్తే బీజేపీ మోసం చేసిందని ఆరోపించారు.

ఎన్నికల్లో పోటీ చేయను..

తాను ఎన్నికల్లో పోటీ చేయడం లేదని జితేందర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. రేవంత్‌తోనూ ఎన్నికల్లో పోటీపై చర్చించలేదని స్పష్టంచేశారు. నిత్యం ప్రజల్లో ఉండే తనకు బీజేపీ టికెట్ రాకపోవడంతో సీఎం బాధపడ్డారని చెప్పారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం చూసి రేవంత్‌రెడ్డి వచ్చినట్లు చెప్పారు. తన భవిష్యత్తును పార్టీ అధినాయకత్వమే చూసుకుంటుందని చెప్పారు. కాగా, జితేందర్‌రెడ్డికి ప్రధాని మోదీ, అమిత్‌షాతో సన్నిహిత సంబంధాలున్నాయి. అయితే, తనకు టికెట్ రాలేదని తెలిసి ఓదార్చేందుకే.. సొంత జిల్లా వాసి అయిన రేవంత్ వచ్చి కలిశారని చెప్పినా మహబూబ్‌నగర్ బీజేపీ, కాంగ్రెస్ వర్గాల్లో మాత్రం పార్టీ మార్పు ఊహాగానాలు పెద్దఎత్తున సాగాయి.

అరుణ ప్రెస్‌మీట్‌లో జితేందర్ కుమారుడు

మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థిగా డీకే అరుణ పేరును ప్రకటించాక జితేందర్‌రెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డి ఆమె నివాసానికి వెళ్లి అభినందలు తెలిపారు. గురువారం జితేందర్‌రెడ్డి నివాసానికి సీఎం రేవంత్ వెళతారని ప్రచారం జరుగుతున్న సమయంలోనే పాలమూరులో అరుణ మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులోనూ మిథున్‌రెడ్డి పాల్గొనడం గమనార్హం.

నేడు హైదరాబాద్‌కు ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

పర్యటించనున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా రెండు రోజుల కిందట వచ్చి, సంస్థాగత బలోపేతంపై రాష్ట్ర పార్టీకి దిశానిర్దేశం చేశారు. బీజేపీ సోషల్ మీడియా వారియర్స్‌తో పాటు పార్టీ పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఆ పైస్థాయి క్యాడర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బీజేపీ ముఖ్య నేతలతో భేటీ అయి పోలింగ్ బూత్‌ల పటిష్ఠత ఆవశ్యకతను వివరించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ శుక్రవారం మరోసారి రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఆయన మూడు రోజుల పాటు పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు నగరంలో మోదీ రోడ్ షోను నిర్వహించినట్లుగానే ఈసారి కూడా బీజేపీ అదే విధంగా ప్లాన్ చేస్తోంది. మూడు పార్లమెంటు నియోజకవర్గాలకు కలిపి ఒక కేంద్రంలో ప్రధాని ఎన్నికల ప్రచారం కొనసాగించేలా రాష్ట్ర పార్టీ ప్రణాళిక రూపొందించింది. ఇందుకు అనుగుణంగా మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, హైదరాబాద్ సెగ్మెంట్లకు కలిపి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో జరిగే రోడ్ షోలో మోదీ పాల్గొంటారు. మీర్జాలగూడ నుంచి మల్కాజ్‌గిరి చౌరస్తా 1.3 కి.మీ మేర ఈ రోడ్ షోను భారీ ఎత్తున నిర్వహించేందుకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. శుక్రవారం సాయంత్రం 4.50 గంటలకు ప్రధాని ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. 5 గంటల నుంచి 6 గంటల వరకు రోడ్ షోలో పాల్గొంటారు. మల్కాజ్‌గిరి చౌరస్తాలో ప్రసంగిస్తారు. అనంతరం, ప్రధాని రాజ్‌భవన్‌కు వెళ్లి బస చేస్తారు. శనివారం ఉదయం 11 గంటలకు బయలుదేరి నాగర్‌కర్నూలులో నిర్వహించే బహిరంగ సభకు హాజరవుతారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి ఈ సభను ఏర్పాటుచేశారు. అనంతరం గుల్బర్గా బయలుదేరి వెళతారు. తిరిగి 18న జగిత్యాలలో నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని పాల్గొంటారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ సెగ్మెంట్లకు సంబంధించి ఈ సభను ఏర్పాటు చేసినట్లు బీజేపీ వర్గాలు వివరించాయి.

రేవంత్‌కు అభద్రతా భావమెందుకు?: లక్ష్మణ్

కాంగ్రెస్‌కు మెజారిటీ ఎమ్మెల్యేలు ఉన్నప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు అభద్రతా భావంతో మాట్లాడుతున్నారని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటుకు మార్గం సుగమమవుతుందని చెప్పారు. ఈ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగాలనే కోరుకుంటున్నామని.. కానీ నిలబెట్టుకోలేకపోతే వారి కర్మ అని అన్నారు. రాష్ట్రంలో 12కు పైగా స్థానాల్లో బీజేపీ విజయం ఖాయమని మాజీ ఎంపీ, చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఓటమికి, ఆ పార్టీ పతనానికి అహంకారమే కారణమని మాజీ ఎంపీ, బీజేపీ మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి సీతారాం ఢిల్లీలో విమర్శించారు. ప్రజలే ఆ అహంకారాన్ని అణచివేశారని తెలిపారు.

పలు ప్రాజెక్టులకు అనుమతులు

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలకు పరిపాలనపర అనుమతులు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఖమ్మం జిల్లాలో మున్నేరు వాగుపై రూ.107.30 కోట్లతో ఆనకట్ట, నాగార్జునసాగర్ ఎడమకాలువపై రూ.35.75 కోట్లతో కొడుమూరు ఎత్తిపోతల పథకం రెండో దశ, కరీంనగర్ జిల్లాలోని కలువల వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది.

తెలంగాణలో కాంగ్రెస్‌దే హవా!

17 లోక్‌సభ స్థానాల్లో 10 ఆ పార్టీ ఖాతాలోకే.. బీజేపీ-4, బీఆర్ఎస్-2, మజ్లిస్-1

- ఏపీలో టీడీపీ కూటమికి ఘన విజయం
- 25 సీట్లలో 20 గెల్చుకునే అవకాశం
- ఉత్తరాదిన మళ్లీ బీజేపీ ప్రభంజనం
- పలు రాష్ట్రాల్లో కమలం క్లీన్ స్వీప్!
- ఏబీపీ-సీఓటర్ సర్వే అంచనాలు
- తెలంగాణలో బీజేపీ 8 సీట్లు

గెలుస్తుందని నెట్‌వర్క్ 18 సర్వే వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 14: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ 10 స్థానాలను కైవసం చేసుకోనుందని ఏబీపీ- సీ ఓటర్ ఒపీనియన్ పోల్ అంచనా వేసింది. మొత్తం 17 స్థానాల్లో బీజేపీ 4, బీఆర్ఎస్ 2, ఎంఐఎం 1 స్థానం గెలవవచ్చని పేర్కొంది. కాగా, ఓట్ల విషయానికొస్తే.. కాంగ్రెస్ 43 శాతం, బీఆర్ఎస్ 28 శాతం, బీజేపీ 25 శాతం, ఎంఐఎం ఒక శాతం ఓట్లను దక్కించుకోవచ్చని ఈ సర్వే తెలిపింది. ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి, వైసీపీ, కాంగ్రెస్‌ల మధ్య త్రిముఖ పోరు ఉంటుందని ఈ సర్వే వెల్లడించింది. మొత్తం 25 సీట్లలో టీడీపీ కూటమి 20 సీట్లను తమ ఖాతాలో వేసుకుంటుందని, వైసీపీ కేవలం 5 స్థానాలకే పరిమితమవుతుందని పేర్కొంది. ఓట్ల పరంగా కూటమికి 45 శాతం, వైసీపీకి 42 శాతం, కాంగ్రెస్‌కు 3 శాతం ఓట్లు లభిస్తాయని తెలియజేసింది. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే ఈ సర్వే వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.


తమిళనాడులో డీఎంకే-కాంగ్రెస్ స్వీప్

కర్ణాటకలో బీజేపీ-జేడీఎస్ కూటమి 23 సీట్లను, కాంగ్రెస్ ఐదు సీట్లను దక్కించుకుంటాయి. తమిళనాడులో మొత్తం 39 సీట్లనూ డీఎంకే-కాంగ్రెస్ కూటమి స్వీప్ చేయనుంది. కేరళలో ఉన్న 20 సీట్లలో 16 సీట్లు కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ గెల్చుకోనుంది. మిగిలిన నాలుగు సీట్లు వామపక్ష (ఎల్‌డీఎఫ్) కూటమి కైవసం చేసుకుంటుంది. బీజేపీకి ఒక్క స్థానం కూడా దక్కే అవకాశం లేదు. ఇక దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం, అత్యధికంగా 80 సీట్లను కలిగి ఉన్న యూపీలో ఈసారి కూడా బీజేపీ హవా వీయనుంది. 74 స్థానాలను ఆ పార్టీ సారథ్యంలోని ఎన్‌డీఏ కైవసం చేసుకుంటుంది. ఎస్పీ-కాంగ్రెస్‌లకు ఆరుకు మించి లభించే అవకాశాల్లేవు. బిహార్‌లో మొత్తం 40 స్థానాలకుగాను ఎన్‌డీఏ కూటమి 32 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసే అవకాశం ఉంది. మిగిలిన ఎనిమిది సీట్లకే ఇండియా కూటమి పరిమితం కావచ్చు. పంజాబ్‌లో మొత్తం 13 స్థానాలు ఉండగా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీ ఆరు స్థానాలను గెల్చుకునే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ 5, బీజేపీ, అకాలీదళ్ చెరో స్థానాన్ని ఖాతాలో వేసుకోవచ్చు. 14 సీట్లున్న జార్ఖండ్‌లో 12 ఎన్‌డీఏ కూటమికి, రెండు ఇండియా కూటమికి లభించవచ్చు. దేశ రాజధాని ఢిల్లీలో మొత్తం ఏడు సీట్లనూ బీజేపీ మరోసారి హస్తగతం చేసుకోనుంది. హరియాణాలో 10 స్థానాలకుగాను బీజేపీ 8, కాంగ్రెస్ 2 స్థానాల్లో విజయం సాధించే అవకాశాలున్నాయి. గుజరాత్ (26), రాజస్థాన్ (25), హిమాచల్ ప్రదేశ్ (4)లను బీజేపీ పూర్తిగా క్లీన్‌స్వీప్ చేయనుంది. ఇక ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న 11 స్థానాల్లో 9 బీజేపీ ఖాతాలోనే పడతాయని ఏబీపీ సీ ఓటర్ సర్వే అంచనా వేసింది. కాగా, నెట్‌వర్క్ 18.. 'మెగా ఒపీనియన్ పోల్' పేరుతో తెలంగాణలో తమ సర్వే వివరాలను గురువారం వెల్లడించింది. ఈ సర్వే ప్రకారం.. రాష్ట్రంలోని 17 సీట్లలో బీజేపీ 8 కైవసం చేసుకుంటుంది. కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 2, ఎంఐఎం ఒక స్థానంలో గెలిచే అవకాశాలున్నాయి. అయితే, ఓట్ల పరంగా కాంగ్రెస్ అత్యధికంగా 34 శాతం ఓట్లను దక్కించుకుంటుందని, బీజేపీకి 28 శాతం, బీఆర్ఎస్‌కు 27 శాతం, ఇతరులకు 11 శాతం ఓట్లు లభిస్తాయని ఈ సర్వే పేర్కొంది.

మల్కాజిగిరిలో రాగిడి లక్ష్మారెడ్డి

ఆదిలాబాద్‌లో ఆత్రం సక్కు.. మరో రెండు ఎంపీ స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ఖరారు చేసిన కేసీఆర్

హైదరాబాద్, ఆదిలాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దిగనున్న మరో ఇద్దరు బీఆర్ఎస్ అభ్యర్థులను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ గురువారం ప్రకటించారు. మల్కాజిగిరి ఎంపీ స్థానానికి రాగిడి లక్ష్మారెడ్డి, ఆదిలాబాద్ స్థానానికి ఆత్రం సక్కు అభ్యర్థిత్వాలను ఆయన ఖరారు చేశారు. ఇప్పటికే ప్రకటించిన వాటితో కలిపి ఇప్పటి వరకు 11లోక్‌సభ స్థానాలకు బీఆర్ఎస్ తమ అభ్యర్థులను ప్రకటించింది. ఉప్పల్ టికెట్ రాకపోవడంతో రాగిడి లక్ష్మారెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. అయితే మల్కాజిగిరి స్థానం నుంచి పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నప్పటికీ అనూహ్యంగా రాగిడి లక్ష్మారెడ్డి అభ్యర్థిత్వాన్ని ప్రకటించడంపై పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన నేతలతో నందినగర్‌లోని తన నివాసంలో కేసీఆర్ గురువారం భేటీ అయ్యారు. ఆదిలాబాద్‌లో పార్టీ అభ్యర్థి ఎవరన్నదానిపై నేతలతో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ క్రమంలో ఆదివాసీ ఉద్యమనేత, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు టికెట్ ఇవ్వాలని నిర్ణయించారు. సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆయనకు ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో అవకాశం ఇవ్వలేదు. అదేసమయంలో ఆయనకు లోక్‌సభకు అవకాశం ఇస్తామన్న అధినాయకత్వం హామీ మేరకు తాజాగా ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి గెలుపొందిన ఆత్రంసక్కు ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. ఇప్పటికే బీజేపీ పార్టీ ఆదివాసీ నేతను అభ్యర్థిగా ఖరారు చేయడం, కాంగ్రెస్‌పార్టీ ఆదివాసీ నేతను బరిలోకి దించేందుకు అవకాశం ఉండడంతో బీఆర్ఎస్ కూడా ఆదివాసీనేతకు అవకాశం కల్పించింది. పొత్తుల్లో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఎస్పీ పార్టీ అభ్యర్థి, జడ్పీ మాజీ ఛైర్మన్ సిడాంగణపతికి అవకాశం దక్కుతుందన్న ప్రచారం జరిగింది. కానీ ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ నేతలంతా ఆత్రంసక్కు వైపే మొగ్గు చూపడంతో ఆయన అభ్యర్థిత్వాన్ని పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. కాగా గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి ఓటమిపాలైన నగేశ్.. తనకు ఈసారి టికెట్ దక్కదని భావించి పార్టీని వీడి బీజేపీలో చేరారు. ఆయనకు ఆదిలాబాద్ టికెట్ ప్రకటించారు.



రాగిడి లక్ష్మారెడ్డి ఆత్రంసక్కు

మత్స్య సొసైటీ ఎన్నికల నామినేషన్లలో ఘర్షణ



సొసైటీ ఎన్నికలపై వాగ్వాదం చేసుకుంటున్న గ్రామస్థులు

చిలుకూరు, మార్చి 14 : మండలంలోని నారాయణపురం ఊరచెరువు మత్స్య సొసైటీ ఎన్నికల నామినేషన్లలో గురువారం గందరగోళం నెలకొంది. కోర్టు ఆదేశాల మేరకు ఊరచెరువు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. అందులో భాగంగా గురువారం నుంచి నామినేషన్లు స్వీకరణ కోసం ఎన్నికల అధికారి అంజయ్య గ్రామానికి వచ్చారు. అయితే గ్రామస్థులు పంచాయతీ వద్ద నామినేషన్లు స్వీకరించే అధికారితో వాగ్వాదానికి దిగారు. గ్రామానికి చెందిన ఊరచెరువులో వివిధ కులాలకు చెందిన గ్రామస్థులు 239మందికి గతంలో సభ్యత్వం ఉండగా, ప్రస్తుతం కేవలం 65 మందికి మాత్రమే సభ్యత్వాలు ఉన్నాయన్నారు. మిగిలిన వారి సభ్యత్వాలను ఉద్దేశపూర్వకంగా తొలగించారని గ్రామస్థులు ఆరోపించారు. సభ్యత్వాల వ్యవహారం తేలే వరకూ సొసైటీ ఎన్నికలు నిర్వహించవద్దని గ్రామస్థులు పట్టుబట్టారు. గతంలో గ్రామంలోని అన్నికులాల వారితో పాటు చిలుకూరు, పాలెఅన్నారం, నారాయణపురం గ్రామస్థులకు సభ్యత్వాలు ఉన్నాయన్నారు. అర్హులైన వారందరికీ సభ్యత్వాలు ఇచ్చిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని పట్టుబట్టారు. గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొందని, సొసైటీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారి అంజయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రామారం మత్స్యసొసైటీని రద్దు చేయండి

భానుపురి, మార్చి 14 : జిల్లాకు చెందని వ్యక్తులతో కలిసి రామారం గ్రామంలో మత్స్యశాఖ సొసైటీని ఏర్పాటుచేశారని, ఆ సొసైటీని వెంటనే రద్దు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామారం గ్రామంలోని ఊరచెరువును పంచాయతీ పరిధిలోనే ఉంచాలని, నల్లగొండ జిల్లా వల్లభాపురం గ్రామానికి చెందిన వ్యక్తులను తీసుకువచ్చి దొంగ ఆధార్‌కార్డు సృష్టించి సొసైటీని ఏర్పాటుచేశారని ఆరోపించారు. సొసైటీని రద్దు చేసి గ్రామస్థులకే కేటాయించాలన్నారు. అధికారులు దొంగ సభ్యులతో కుమ్మక్కై సంఘాన్ని ఏర్పాటుచేశారని ఆరోపించారు. గ్రామ పంచాయతీ పరిధిలో పరిశీలన చేసి సొసైటీని రద్దు చేయాలన్నారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని, సంఘాన్ని రద్దు చేయాలని కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ధర్నాలో బొల్లం నాగరాజు, పల్సా మల్లేష్, పల్సా సైదులు, తీగల వెంకన్న, ఉయ్యాల ఉపేందర్, సత్యనారాయణ, తీగల ప్రభాకర్, పల్సా వెంకటయ్య, లతో పాటు మరికొందరు గ్రామస్థులు ఉన్నారు.

సోమప్ప దేవాలయం శివరాత్రి ఆదాయం రూ.1.61లక్షలు

నేరేడుచర్ల, మార్చి 14 : మండలంలోని బూర్గులతండా గ్రామపంచాయతీ పరిధిలోని చారిత్రక సోమప్ప దేవాలయంలో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా రూ.1,61,080 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ చిత్తనూరి సత్యనారాయణ తెలిపారు. దేవాలయ ఆవరణలో గురువారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. హుండీ కానుకలుగా రూ.1,03,913 రాగా, దర్శనం టిక్కెట్లు, అభిషేకాల ద్వారా రూ.57,155లు వచ్చాయన్నారు. హుండీ కానుకల లెక్కింపులో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నిఖిల్, మేనేజర్ మృత్యుంజయశాస్త్రి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, వైస్‌చైర్మన్ లొడంగి సైదులు, పగిడిమర్రి సోమయ్య, పెండెం సైదులు, మాలోతు బాలామణి, ప్రవీణ్, కృష్ణారావు, అజయ్, గోవర్ధన్, రవి, బుజ్జయ్య, రహీం, సోందుమియా, గోపాలకృష్ణ, విజయ్, వెంకటేశ్వర్లు, శ్రీను పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ: ఒకరు మృతి



అనంతరెడ్డి(ఫైల్)



ప్రమాదంలో ధ్వంసమైన కారు, కారులోనే మృతి చెందిన అనంతరెడ్డి

మద్దిరాల, మార్చి 14: రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొని ఒకరు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మద్దిరాల మండల కేంద్రం సమీపంలోని రెడ్డిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండలం పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన కాకి అనంతరెడ్డి(35) కారు యజమాని కిరణ్‌తో కలిసి కారులో పని నిమిత్తం తుంగతుర్తికి వెళ్తున్నారు. అదేసమయంలో భద్రాద్రికొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం మాదాస్ తండా గ్రామానికి చెందిన సాయికుమార్ తన స్నేహితుడు రాజేష్‌తో కలిసి కారులో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలకేంద్రం సమీపంలోని రెడ్డిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అనంతరెడ్డి(35) అక్కడికక్కడే మృతిచెందాడు. సాయికుమార్‌కు ఒక కాలు విరిగింది. రాజేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అనంతరెడ్డికి భార్య, కుమార్తె ఉంది. అనంతరెడ్డి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నాగయ్య తెలిపారు. మృతదేహాన్ని తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భూవివాదంలో అన్నను చంపిన తమ్ముడు

నాగారం మార్చి 14: భూవివాదం నేపథ్యంలో విద్యుత్ వైర్లను ఏర్పాటు చేసి అన్నను హత్య చేసిన తమ్ముడు, అతడికి సహకరించిన మరో ఇద్దరు జైలుపాలయ్యారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ వెంకట్‌రెడ్డి గురువారం వివరించారు. మాచిరెడ్డిపల్లి గ్రామంలోని రైతు మట్టగజం అవిలయ్య గత నెల ఫిబ్రవరి 26వ తేదీన వ్యవసాయ క్షేత్రంలో విద్యుత్ మోటారు పెట్టడానికి వెళుతుండగా విద్యుత్ సర్వీసు వైర్లు తగిలి విద్యుదాఘాతంతో మృతిచెందారు. అవిలయ్య మృతిపై అతని భార్య పద్మ అనుమానంతో నాగారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మట్టగజం మల్లయ్య, అతని కూమారుడు లక్ష్మణ్, సమీప బంధువు మట్టగజం సాయికూమార్‌లను పోలీసులు విచారించారు. అవిలయ్య మృతికి వారే కారణమని ఒప్పుకున్నారని ఎస్ఐ తెలిపారు. గురువారం వారిని అరెస్టు చేసి తుంగతుర్తి సివిల్ జడ్జి ఎదుట హాజరు పరిచి, జైలుకు తరలించారు. మట్టగజం అవిలయ్యకు స్వయాన తమ్ముడు. మట్టగజం మల్లయ్యల మధ్య 10 సంవత్సరాలుగా వ్యవసాయ భూముల మధ్య వివాదంతో తరుచూ గొడవలు జరిగేవి. ఎలాగైనా అన్నను చంపాలని నిర్ణయించుకున్న మట్టగజం మల్లయ్య అతడి కుమారుడు లక్ష్మణ్, సమీప బంధువు మట్టగజం సాయికుమార్‌లు కలిసి అవిలయ్య విద్యుత్ మోటారుకు వెళ్లే సర్వీస్ వైరుకు అక్కడక్కడ అతుకులు చేసి అడవి పందుల కోసం వినియోగించే విద్యుత్ వైరును సర్వీస్ వైరుకు కలిపి పొలంలో వేశారు. అవిలయ్య పొలం దగ్గరికి గత నెల ఫిబ్రవరి 26న మోటారు పెట్టడానికి వెళ్తుండగా గట్లవెంట కనపడకుండా అమర్చిన విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అవిలయ్య మృతికి కారకులైన మట్టగజం మల్లయ్య, లక్ష్మణ్, సాయికుమార్‌లపై హత్యానేరం కింద కేసు నమోదు చేసి వారిని తుంగతుర్తి సివిల్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి ఆదేశాలతో సూర్యాపేట జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇరుకు దారితో ఇక్కట్లు



రెండు వాహనాలు రాకపోకలు సాగించేందుకు పడుతున్న ఇబ్బందులు

మునగాల రూరల్, మార్చి 14 : మండలంలోని బరాకత్‌గూడెం నుంచి రాయినిగూడెం రహదారి ఇరుకుగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న బరాకత్‌గూడెం నుంచి రాయినిగూడెం మీదుగా మిర్యాలగూడకు ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. మునగాల మండలంలోని గ్రామాలతో పాటు చిలుకూరు, గరిడేపల్లి మండలాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం. బరాకత్‌గూడెం నుంచి ఊరి బయట వరకు రోడ్డు చాలా ఇరుకుగా, ప్రమాదకరంగా ఉంది. ఎదురుగా వాహనాలు వస్తే దాటుకుని వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు ఎవరో ఒకరు వెనుకకు వెళ్లాల్సి ఉంటుంది. అదే సమయంలో చిన్నచిన్న వాహనాలు వస్తే ఎటూ తొలగలేని పరిస్థితితో ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనుల సమయంలో, ధాన్యం చేతికొచ్చే సమయంలో ఈ దారిలో రైతులు పడే బాధలు వర్ణనాతీతం. ట్రాఫిక్ జామ్ అయితే ఒక్కోసారి అరగంట పడుతుంది. రోడ్డుని వెడల్పు చేసి ప్రజలకు మంచి సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



ఇరుకు రహదారిలో పెద్దవాహనం రాకతో నిలిచిన రాకపోకు

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

సూర్యాపేట(కలెక్టరేట్) / భానుపురి, మార్చి 14 : పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ కోసం సామూహిక టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ప్రారంభించనున్నారు. నాల్గో విడత చేపడుతున్న టీకాల పంపిణీని ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకు నెల రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికారులు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ వెంకటరావు ఒక ప్రకటనతో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 3,85,018 పశువులకు నివారణ టీకాలు వేస్తామని, ఇందుకోసం 260 మంది పశువైద్యాధికారులు, సిబ్బందితో కూడిన 63 బృందాలతో కార్యాచరణ పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వేసవిలో జాగ్రత్తలు పాటించాలని పశుపోషకులకు సూచించారు. టీకా కార్యక్రమంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని, ఉదయం, సాయంత్రం వేళల్లోనే టీకాలు వేయాలని, టీకా నిర్వహణ సమయంలో కోల్డ్‌చెయిన్ నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. గతంలో మిగిలిన వాటితో సహా మొత్తం పశువులకు టీకాలు వేయాలని ఆదేశించారు. ప్రతీ గ్రామంలో తొలిరోజు ప్రజాప్రతినిధులతో కార్యక్రమాన్ని ఉత్సవ వాతావరణంలో ప్రారంభించాలన్నారు. చెవిపోగులు ఊడిపోయిన పశువులకు తిరిగి పోగులు వేయించాలన్నారు. టీకాల లబ్ధిదారుల వివరాలను విధిగా భారత్ పశుదాన్ పోర్టల్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. టీకా సమయంలో ఏమైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే స్పందించాలని, అందుకోసం అత్యవసర మందుల కిట్‌ను వెంట ఉంచుకోవాలని సూచించారు.

ఆత్మకూర్ (ఎస్): మండలంలోని గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కోసం రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు పశువైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు టీకాల నమోదును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే



అర్వపల్లి పాఠశాలలో తరగతి గదతుల కోసం శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

అర్వపల్లి, మార్చి 14 : పేదింటి ఆడబిడ్డలకు త్వరలో రూ.లక్షతో పాటు తులం బంగారం ఇచ్చి అండగా ఉంటానని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం అర్వపల్లి మండల పరిషత్ కార్యాలయంలో అర్వపల్లి, నాగారం మండలాలకు చెందిన 81మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో రూ.27లక్షలతో నిర్మించే అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేసి ఆయన మాట్లాడారు. శ్రీరాంసాగర్ గోదావరి జలాలు అందజేస్తున్నామని, రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, బ్రహ్మయ్య, ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మినర్సయాదవ్, ఎంపీడీవో సందీప్, ఎంఈవో బాలునాయక్, హెచ్‌ఎం నర్సయ్య, బైరబోయిన మహరాజు, అల్వాల వెంకటస్వామి, జీడి వీరస్వామి, పాల్లెల్లి సురేష్, బైరబోయిన సైదులు, దిర్శనం కృష్ణమూర్తి, కోటిప్రసాద్, సాయిని మనోహర్, సంతు, కనుకు మహేష్, గణేష్ పాల్గొన్నారు.

తిరుమలగిరి : కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే మందుల సామేల్ తెలిపారు. తిరుమలగిరి పరిధిలోని అనంతారం మోడల్‌స్కూల్‌లో పీఎంశ్రీ పథకం ద్వారా రూ.13.50లక్షలతో నిర్మించనున్న సైన్స్ ల్యాబ్ పనులకు శంకుస్థాపన చేసి, మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేముల బాలరాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వై నరేష్ పాల్గొన్నారు.

నూతనకల్ : నియోజకవర్గంలో ఉన్న ప్రతీ ప్రభుత్వ పాఠశాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. మండలంలోని పెద్దనెమిల, దిర్శనపల్లి గ్రామాల్లో ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు, ప్రహరీ నిర్మాణాలకు శంకుస్థాపన చేసి, మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు జెన్నారెడ్డి వివేక్‌రెడ్డి, తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, నాగం సుధాకర్‌రెడ్డి, చురికంటి జానకమ్మ, లావుడ్య సజ్జన్‌నాయక్, రామస్వామి, రాచకొండ అయోధ్య, అశోక్, పాండవుల లింగయ్యచంద్రారెడ్డి, ఎంఈవో రాములునాయక్ పాల్గొన్నారు

విద్యార్థులు వైజ్ఞానిక అంశాలపైనా దృష్టి సారించాలి



వెలిశాలలోని సాయి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

తిరుమలగిరి రూరల్, మార్చి 14: విద్యాభ్యాసంతో పాటు ఇతర వైజ్ఞానిక అంశాలపై విద్యార్థులు దృష్టి సారించాలని సాయి ఇంగ్లీష్ పాఠశాల కరస్పాండెంట్ పొన్నం వెంకటనారాయణ అన్నారు. వెలిశాల గ్రామంలోని సాయి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆయన బహుమతులను అందజేసి, మాట్లాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పొన్నం వెంకటనారాయణ, హెచ్‌ఎం యాదగిరి స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూర్యాపేటఅర్బన్: జిల్లా కేంద్రంలోని శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధికార, రాజకీయ నాయకుల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అనితమోహన్, ప్రిన్సిపల్ జగన్‌మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగారం : మండలంలోని శాంతినగర్ ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీ శైలజ, ఉపాధ్యాయులు చిత్తలూరి శ్రీరాములు, అంగన్‌వాడీ టీచర్ మంజుల పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : మండలంలోని నశీంపేట ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఏమెలియా, ఉపాధ్యాయులు హైమావతి, రఘుపతి, వెంకటయ్య, జ్యోతి, సుధీర్ కుమార్ పాల్గొన్నారు

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు హర్షనీయం



సీఎం, ఉత్తమ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్యులు

హుజూర్‌నగర్ రూరల్, మార్చి 14: ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని ఆర్యవైశ్య సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చనరవి, మాశెట్టి అనంతరాములు, ఓరుగంటి నర్సింహారావు, పోలిశెట్టి నర్సింహారావు, ఓరుగంటి నాగేశ్వరరావు, విద్యాసాగర్, శింగిరికొండ శ్రీను, వెంకటనారాయణ, ఉప్పల రమేష్, అనంతరాములుగుప్తా, నర్సింహారావు, సత్యనారాయణ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌ఆర్‌టీసీ సేవకుడు ముత్తయ్య గుండెపోటుతో మృతి



ముత్తయ్య(ఫైల్)

తుంగతుర్తి, మార్చి 14 : తుంగతుర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో సేవకుడిగా 24 ఏళ్లుగా సుపరిచితుడైన మంగళపల్లి ముత్తయ్య గుండెపోటుతో గురువారం మృతి చెందారు. బస్టాండ్ ఆవరణలోని మరుగుదొడ్ల నిర్వహణతో వచ్చే కొంతమొత్తంతో జీవితాన్ని వెళ్లదీస్తూ అక్కడే ఉంటూ ప్రయాణికులకు సమాచారాన్ని అందిస్తూ ఉంటారు. ఈ క్రమంలో ఆయనకు ఈ ప్రాంత ప్రయాణికులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. గురువారం ఉదయం గుండెపోటుతో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోనే మృతి చెందాడు. ముత్తయ్య బస్టాండ్ ఆవరణలో కొన్ని టేకు చెట్లను కూడా నాటి పెంచగా అవి నేడు వృక్షాలుగా మారాయి. అతడి భార్య గతంలోనే మృతి చెందింది. ఉదార స్వభావంతో ఒక కుమారుడిని దత్తత తీసుకుని పెంచి పెద్దచేశాడు. ముత్తయ్య సేవలను గుర్తించి కుటుంబానికి ఆర్థికసాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న సంయుక్త మోర్చ నాయకులు

సూర్యాపేటటౌన్, మార్చి 14: కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. గురువారం కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నల్లజెండాలతో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి, మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం రైతుల వెన్ను విరిచేలా నల్లచట్టాలను తీసుకొచ్చిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌కుమార్, పేర్ల నాగయ్య, గొడ్డలి నర్సయ్య, చంద్రకళ, వీరబోయిన రమేష్, సూరం రేణుక, జయమ్మ, వాజిద్, వీరబాబు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సూర్యాపేట సిటీ: పంటలకు అందించే మద్దతు ధరకు చట్టం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జునరెడ్డి, ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డ వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, కోట గోపి, దండా వెంకటరెడ్డి, గంట నాగయ్య, బొడ్డు శంకర్, అంతయ్య, బూర వెంకటేశ్వర్లు, జేసోజు మధు, శంకర్‌రెడ్డి, నరసింహారావు, వెంకన్న, నరసయ్య పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండలంలోని వెలిదండలో నిర్వహించిన నిరసనలో అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ అధ్యక్షుడు మేకల కనకారావు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామల్ల నవీన్, కామళ్ల శ్రీను, అరుణోదయ జిల్లా నాయకులు గండు నాగేష్, మాశెట్టి అంజయ్య, సాంబయ్య, పర్వతాలు, లచ్చయ్య పాల్గొన్నారు.

దేవాలయాల కమిటీల నియామకం

మేళ్లచెర్వు, మార్చి 14 : చింతలపాలెం మండలంలోని రేపల్లె గ్రామ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ చైర్మన్‌గా ముడియాల తిరుపతిరెడ్డి నియమితులయ్యారు. సభ్యులుగా గుణమళ్ళ వెంకయ్య, అయిల పొంగు మాధవి, దోమ నాగరాజు, బత్తుల వెంకటేశ్వర్‌రెడ్డి, దివి ప్రసన్నకుమార్ నియమితులయ్యారు. అదేవిధంగా శ్రీ శారదా చంద్రమౌళేశ్వరస్వామి ఆలయానికి చైర్మన్‌గా బత్తుల శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తలుగా ఏలేటి చంటి, యర్రమళ్ల అనసూయమ్మ, సిద్దే సైదులు, బత్తుల సంజీవరెడ్డి, శ్రీరామచంద్రమూళ్లేశ్వర శర్మ దేవదాయ శాఖ నియమించిందని ఆలయాల ఈవో లక్ష్మణ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

పారిశుధ్య లోపంతోనే జ్వరాలు వ్యాపిస్తాయి

పాలకవీడు, మార్చి 14: పారిశుధ్య లోపంతోనే విష జ్వరాలు వ్యాపిస్తాయని జిల్లా వైద్యాధికారి సాహితి అన్నారు. మండలంలోని కల్మెట్‌తండాలో గురువారం వైద్యశిబిరంలో పాల్గొని, మాట్లాడారు. ఇటీవల తండాల్లో విషజ్వరాలు పెరిగాయని, వాటి నివారణకు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. అవసరమైన వారికి మందులు పంపిణీచేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి నాగిని, శ్యాంసుందర్, రమ్య, అంజలి, రచన తదితరులు పాల్గొన్నారు.

పీఎం శ్రీ పథకానికి మోడల్ స్కూల్ ఎంపిక

తిరుమలగిరి, మార్చి 14: తిరుమలగిరి మునిసిపాలిటీ పరిధి అనంతారం మోడల్ స్కూల్ పీఎం శ్రీ పథకానికి ఎంపికైంది. ఈ సందర్భగా పాఠశాలకు మోటివేషన్ స్పీకర్‌గా సుందర్ హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధకావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేముల బాలరాజు, టీచర్లు పాల్గొన్నారు.

మహిళలకు స్వయం ఉపాధి మార్గాలు

గరిడేపల్లి, మార్చి 14: మహిళలు చిరుధాన్యాలతో విలువాధారిత ఉత్పత్తులను తయారు చేసి మార్కెటింగ్ చేయడం ద్వారా ఉపాధి పొందవచ్చని కేవీకే ప్రోగ్రాంఇన్‌చార్జి డైరక్టర్ డీ నరేష్ తెలిపారు. మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో జిల్లాలోని భాషానాయక్ తండా మహిళలకు బేకరీ ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చారు. అనంతరం మహిళలు కేవీకేలోని యూనిట్లను సందర్శించారు.

బ్యాంక్ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

సూర్యాపేటఅర్బన్, మార్చి 14: ఆర్టీసీ సిబ్బంది యూనియన్ బ్యాంకు అందజేసే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం యూనియన్ బ్యాంకు డిప్యూటీ రీజినల్ మేనేజర్ ప్రకాష్‌బాబు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో మెగా రుణమేళా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డీపో మేనేజర్ డీ సురేందర్, రామలింగేశ్వర్‌రావు, పీవీ సురేష్‌బాబు, హఫీజ్, ప్రదీప్, లక్నోజీ, విజయబాస్కర్, బ్యాంకు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

జీవనశైలి వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

మునగాల రూరల్, మార్చి 14 : అధిక రక్తపోటు, మధుమేహంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి కోరారు. గురువారం మునగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆసుపత్రిలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రవీందర్, స్టాఫ్‌నర్సులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యం ఇచ్చే వారికే మద్దతు


ఆత్మకూర్ (ఎస్), మార్చి 14 : గౌడ కులస్థులకు ప్రాముఖ్యం ఇచ్చిన పార్టీలకే పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు ఇస్తామని గౌడ జన హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎలికట్ట విజయకుమార్ అన్నారు. గురువారం మండలంలోని నెమ్మికల్ గ్రామంలో సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గౌడ కులస్థులకు ఏ పార్టీ టికెట్ ఇచ్చినా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కార్యాల శ్రీనివాస్ గౌడ్, బిక్కి బుచ్చయ్య గౌడ్, చిత్తలూరి నారాయణ గౌడ్, దంతూరి సోమన్న, బూర సైదులు గౌడ్, వెంకటేష్, కప్పల రాంమూర్తి, తాడూరు సైదులు, జలగం మల్లేష్, గుణగంటి భిక్షం, మారగాని మారయ్య, సతీష్, తిరుమలేష్, లింగయ్య పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవం

నేరేడుచర్ల, మార్చి 14 : జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని నేరేడుచర్లలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సరికొప్పుల నాగేశ్వరావు కేక్ కట్ చేసి పార్టీ కార్యాలయంలో మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొమ్మ రాజు, శ్రీను, నాగాచారి, వాసునాయుడు, అనిల్ నాయుడు, రాకేష్, పవన్ కళ్యాణ్, అంజి, యశ్వంత్ పాల్గొన్నారు.

కార్టూనిస్టు ఆనంద్‌కు సన్మానం

సూర్యాపేటఅర్బన్, మార్చి 14: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కార్టూనిస్టు, ఆర్టిస్టు శిరంశెట్టి ఆనంద్‌ను గురువారం నల్లగొండ జిల్లా సిలివేరు సాహితీ కళాపీఠం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించేలా కళాపీఠం సభ్యులు అవార్డులు అందజేయడం గొప్పవిషయమన్నారు. సన్మానాలు, అవార్డులు బాధ్యతను పెంచుతాయన్నారు.



సూర్యాపేట క్రైం: జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రహదారిలో విచ్చలవిడిగా హారన్లు కొడుతూ ప్రమాదకరంగా డ్రైవింగ్ చేస్తున్న యువకులకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. వారితో పాటు త్రిబుల్ రైడింగ్ చేస్తున్న పలువురిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. అనంతరం సీఐ రాజశేఖర్ యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

సూర్యాపేట సిటీ / కోదాడ టౌన్: మార్క్సిజం ద్వారానే దోపిడీ లేని సమాజాన్ని సాధించగలమని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. కారల్ మార్క్స్ 141వ వర్ధంతి సందర్భంగా జిల్లాకేంద్రంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, కోట గోపి పాల్గొన్నారు. కోదాడలోని లాల్‌బంగ్లాలో జరిగిన కార్యక్రమంలో అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి నర్సింహారావు, షైనయ్య, సత్యనారాయణరెడ్డి, సైదులు, రామారావు, కాశీ పాల్గొన్నారు.

మద్దిరాల: మండలంలోని కుంటపల్లి గ్రామంలో ఉపాధి నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిల మల్లుయాదవ్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం, ఉపేందర్, మల్లయ్య, లింగయ్య, నారాయణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు : పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి సూచించారు. చిలుకూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సూర్యాపేటటౌన్: జిల్లా కేంద్రంలోని పబ్లిక్‌క్లబ్‌లో ఈ నెల 16న నిర్వహించే మాదిగ సమ్మేళన కరపత్రాలు తెలంగాణ మాదిగ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండమీది గోవిందరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జఫానియా, సంజయ్, శంకర్, శ్రావణ్, బాలు, రవి, ప్రభు, రఘు, ఎనీష్, భార్గవ్ పాల్గొన్నారు.

సూర్యాపేటటౌన్: మాలలకు ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటుచేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంపై మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మేక వెంకన్న హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాల మహానాడు సంఘ నాయకులు పాల్గొన్నారు.

తిరుమలగిరి: లింగాయత్‌లకు కార్పొరేషన్ ప్రకటించడంపై తిరుమలగిరి మండల లింగాయత్‌ల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో లింగాయత్ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు స్వాతి వినయ్, సోమన్న, సోమరాజు, రాజేందర్, సోమేశ్వర్, రవికిరణ్ పాల్గొన్నారు.

నాగారం: మండలంలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో కోమ్ము రాజు (35) ఇటీవల మృతి చెందాడు. అతడి కుటుంబసభ్యులకు స్నేహితులు ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ తరుఫున రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వడ్డే మధు, నాతి మహేష్, సోమ శేఖర్, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి: కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి మట్టిపల్లి సైదులు ఆరోపించారు. సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ చట్టంలో అనేక మార్పులు చేస్తూ చట్టాన్ని రద్దు చేయాలని కుట్రలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భూక్య పాండు నాయక్, మాలోతు బాలునాయక్, హుస్సేన్, వెంకటేశ్వర్లు, రాము తదితరులు ఉన్నారు.

మోతె : ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేయడమే లక్ష్యంగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్(ప్రజాపంథా) పనిచేస్తుందని జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. హుస్సేనాబాద గ్రామ బీఆర్ఎస్ నాయకులు చెరుకు యల్లయ్య, గణేష్, మహేష్‌లతో పాటు 28 కుటుంబాలు పార్టీలో చేరాయి. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీవోడబ్లు జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, జిల్లా కమిటీ సభ్యులు ఆరింగుల వెంకన్న, అఖిల్, రమేష్ పాల్గొన్నారు.

మఠంపల్లి: చెన్నాయిపాలెం అంగన్‌వాడీ టీచర్ గుర్రం అన్నమ్మ(66) అనారోగ్యంతో మృతి చెందింది. మూడు దశాబ్దాలుగా ఉమ్మడి చెన్నాయిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రానికి టీచరుగా పని చేస్తున్నారు. ఆమె మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

మఠంపల్లి: మండలకేంద్రంలో వాహనంలో తరలిస్తున్న 30క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. డ్రైవర్‌తో పాటు వ్యాపారి పద్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మఠంపల్లి: అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మఠంపల్లి గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా గుండెపంగు సైదులు ట్రాక్టర్‌లో చౌటపల్లి వైపు ఇసుకను తరలిస్తుండగా గుర్తించి వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

నూతనకల్, మార్చి 14: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడానికి ప్రభుత్వంతో పాటు దాతలు ముందుకు రావడం అభినందనీయమని కేజీబీవీ స్పెషల్ అధికారి మాధవి అన్నారు. ఉపాధ్యాయురాలు హారిక కుటుంబసభ్యులు సుమారు రూ.లక్ష విలువైన ఎల్‌ఈడీ టీవీ, సౌండ్ సిస్టమ్, ఫ్యాన్లు, కుర్చీలు, డోర్‌లు అందజేశారు.

పెన్‌పహాడ్: పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించి మంచి పేరు తీసుకురావాలని టీయూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లచ్చిమల్ల వెంకన్న అన్నారు. మండలంలోని చీదేళ్ల జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పరీక్ష సామాగ్రితో పాటు ప్లేట్లు పంపిణీ చేసి, మాట్లాడారు. కార్యక్రమంలో వార్డుసభ్యుడు చింత రాంబాబు, పందుల నాగరాజుగౌడ్, గొబ్బి రమేష్, పోతురాజు నరేందర్, చింత సైదులు, బుస్సి గోవర్ధన్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మండలకేంద్రానికి చెందిన మేకపోతుల చంద్రయ్య ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్స్ అందించారు. నేరేడుచర్లకు చెందిన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పొనుగోడు గ్రామంలో రోడ్డు పక్కన చిరు వ్యాపారులకు,చెప్పులు కుట్టుకునే వారికి ఏఎస్ఐ రాములునాయక్ చేతుల మీదుగా గొడుగులు పంపిణీచేశారు.కార్యక్రమంలో ఎంఈవో ఛత్రునాయక్, పాఠశాల అధ్యాపకులు, లయన్స్‌క్లబ్ సభ్యులు జిలకర రామస్వామి, సువర్ణ, కందిబండ శ్రీనివాస్, సుందరి నాగయ్య, విశ్వనాథ్, పూర్ణచంద్రారెడ్డి, చిన్నప్ప పాల్గొన్నారు.

మోతె: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు సహాయసహకారాలు అందించాలని నామవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీఎల్ఎన్ చారి అన్నారు. సుధాకర్ పీవీసీ కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపణి చేసి మాట్లాడారు. కార్యక్రమంలో టీచర్లు కొత్తపల్లి రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, సురేష్, జయరామ్, జానకిరాములు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేరేడుచర్ల: దిర్శించర్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల పదో తరగతి విద్యార్థులకు బొలిశెట్టి శివ జ్ఞాపకార్థం సోదరుడు శంకర్ పరీక్ష ప్యాడ్లు అందజేశారు. వీటిని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీదేవి, శ్రీనివాస్, అశోక్‌కుమార్, విజయకుమార్, కోటిరెడ్డి, వెంకటకృష్ణ పాల్గొన్నారు.